
# న్యాయానికి అటూ ఇటూ...

కె. లలితాచలం



"సుబ్బారాయుడ్ని ఎవరో ఖూనీ చేశారుట," అన్న వార్త తెల్లవారకుండానే ఊరిన పడింది. పాదరసంలా పాకింది. అనోట అనోట క్షణాలమీద ఊరందరికీ తెలిసింది. పాడు నిద్రని తుంగలో తొక్కి, కాలకృత్యాలకు కొంతకాలం వాయిదావేసి 'ఎక్కడ? ఎప్పుడు?' అంటూ పరుగులు తీశారు జనం.

'వెంకటార్రాయుడి కొబ్బరితోటలో'

అన్నారెవరో పరుగుతీస్తూనే. బోర్లబొక్కలా పడివున్న సుబ్బారాయుడి శవాన్ని చూశారు. వెన్నులో వాడిగా గుచ్చుకుని, నిటారుగా నిలబడ్డ గడ్డపారని చూశారు. 'వెంకట్రాయుడి కొడుకు సుబ్బారాయుడి మీద చెయిచేసుకోగల మగాడు పుట్టాడా!' అనుకున్నారు ఆశ్చర్యంలో మునిగి తేలుతూ. తృప్తితో హాయిగా నిట్టూర్చారు కొందరు.

ఆ గడ్డపారని తేరిపార చూశారు. అదెవరిదో గుర్తుపట్టేసినట్లుగా తను బొమలెగరేసి కళ్లు పెద్దవిచేసి అందరి వంకా తిరిగి చూశారు కొందరు. ఆ దుర్మార్గం చేసిందెవరో మనిషిని చూడకుండానే ఏదో ఆధారం దొరికినట్లుగా సంతోషంతో మునకలు వేశారు. నిర్ధారణచేశారు. అందరూ ఆ నిర్ధారణ సరైనదేనన్నట్లుగా బలపరిచారు, ఒక్క కూనయ్యతాత తప్ప.

సుడిగాలిలా దూసుకెళ్ళి కొమరయ్య గుడిశను చుట్టేశారు. గుడిశ బయట కుక్కిమంచాన్ని చూశారు. మంచంలో ముడుచుకొని పడుకున్న రంగడ్ని చూశారు. వాడి ఒంటికి చుట్టుకుపోయిన రక్తపుమరకల బట్టల్ని చూశారు. తమ అంచనా నూటికి నూరుపాళ్ళ సరిపోయినందుకు గర్వంగా మీసాలు దువ్వారు. ఈనిన పులిలాగా రంగడి మీదకు అమాంతం దూకారు. పంజాల్లో ఇరుక్కున్న కుందేలుపిల్లలాగా రంగడు కిక్కురుమనలేదు. తను చేసిన తప్పుకు, ఎప్పుడైనా ఇలా జరుగుతుందని ముందే ఊహించినట్లున్నాడు. మారుమాటాడకుండా వారి వెంట నడిచాడు. ఖూనీకోరు అంత తొందరగా తేలిగ్గా దొరుకుతాడని ఊహించనివారు ఆశ్చర్యపోయారు. సాహసకార్యాన్ని సాధించుకొచ్చామని గర్వపడ్డారు కొందరు. కాని కూనయ్యతాత ఏదీ చెయ్యలేకపోయాడు. తన కళ్ళతో చూస్తున్నది, చెవులతో వింటున్నది నమ్మలేకపోతున్నాడు కూనయ్యతాత.

కారణం రంగడ్ని గురించి తాతకు బాగా తెలుసు. తాత ఈ రోజు కొత్తగా రంగడ్ని చూడటంలేదు. పదిహేను సంవత్సరాలనుంచీ ప్రతి నిత్యం చూస్తూనే ఉన్నాడు. పది సంవత్సరాల పిల్లవాడప్పటినుంచీ చూస్తున్నాడు.

కొత్తగా పెళ్ళైన వదినమ్మ కొంగు పట్టుకుని ఒదిగి ఒదిగి నడుస్తూ పదిహేను సంవత్సరాల క్రితం ఆ ఊళ్ళో అడుగు పెట్టాడు రంగడు. అన్నా వదినా, అమ్మా నాన్నా అనుకున్నాడు. అన్న కొమరయ్యంటే రంగడికి భయం, భక్తి, గౌరవం, దేముడిమీదున్నంత విశ్వాసం కూడా ఉంది.

అన్న కొమరయ్యకు ఆరో ప్రాణం రంగడు. అసలు రంగడికోసమే, వెంకట్రాయుడి ఇంట్లో పాలేరుగా

కుదిరాడు కొమరయ్య. రంగడు చదవాలి. యజమాని కొడుకు సుబ్బారాయుడులాగా పలకా బలపం తీసుకుని బడికెళ్ళాలి. కలెక్టరు కాకపోయినా బిల్ కలెక్టర్ అయినా అయితే చూడాలని కొమరయ్య ఆశ. అందుకే వెంకటాద్రియుడి కొబ్బరి తోటలో పనికికుదిరాడు. తోటలోనే గుడిశ వేసుకుని, రాత్రనక పగలనక గొడ్డులాగా చాకిరీచేస్తూ తోటనే కాపాడుతున్నాడు. తోట తెగ పండితే రాయుడు సంతోషిస్తాడనుకున్నాడు, అప్పుడప్పుడు ఐదూ, పదీ గుప్పెట్లోకుక్కి వేళ్ళు ముడుస్తుంటే, సంతోషం పట్టలేకపోతే అలా చేస్తాడు కాబోలు అనుకున్నాడు. కొత్తల్లో, వెలిపసుపు పారాణి ఆరకుండానే పెళ్ళాం మంగమ్మ శవం మోటబావిలో తేలితే కాలుజారి పడిందనుకున్నాడు కొమరయ్య అమాయకంగా.

కాని వదినమ్మ ఎందుకు చచ్చిపోయిందో పూర్తిగా అర్థం తెలియకపోయినా రంగడికి కొంత తెలుసు, ఏదో తెలుసు. ఆ దృశ్యం పసిహృదయంలో నాటుకుపోయింది. అన్నకు చెప్పాలంటే ఎలా చెప్పాలో చేతకాలేదు. అందుకే ఏమీ చెప్పలేదు. తమ్ముడి ఆలనా పాలనా చూడాటానికో అడదిక్కుగా రత్తాల్ని మారుమను వాడాడు కొమరయ్య.

రత్తాలు మంచిది. గడుసుది. కత్తిలాంటిది. రంగడ్ని గుండెలో హత్తుకుని పెంచింది. వదిన్ని హృదయంలోనే పూజిస్తూ పెరిగాడు రంగడు. రంగడితో పాటూ మరపురాని ఆ దృశ్యం పొగలు సెగలు రేపుతూ పెరిగింది. పిలకలు కూడా వేసింది, కందలాగా.

రంగడికి చదువు రాకపోయిన వస్తాదులాగా బలిష్ఠమైన వొళ్ళు వచ్చింది. గొర్రెపొట్టేళ్లా రెచ్చగొట్టే చూపులు వచ్చాయి. ఉసిగొలిపితే, "ఢీ" అంటే "ఢీ" అని కండబలం చూపించే ధైర్యం వచ్చింది. అన్నలాగా పిరికితనం రాలేదు.

రంగడికి వదిన ఒక్కతే అమ్మ కాని వదినమ్మ మాత్రం రంగడికి కాక మరి ఏడుగురు ఆడపిల్లలకు అమ్మైపోయింది.

రత్తాలు కొమరయ్య మొత్తుకుంటూ జనం వెనకే పరుగులు తీస్తూ వచ్చారు. అప్పటికే పోలీసులు కూడా వచ్చేశారు. సుబ్బారాయుడి శవంతోపాటు రంగడ్ని కూడా పోలీసువానులో ఎక్కించారు. ఊరివారిచ్చిన సాక్ష్యాల ఆధారంతో రంగడికి బేడీలు వేశారు.

"ఎంతపని చేశావురా రంగా!" అంటూ నెత్తీ నోరూ కొట్టుకుంటూ వచ్చాడు కొమరయ్య. కాని కొమరయ్య మాటలు రంగడికి వినిపించినా, తిరిగి రంగడు ఏదీ చెప్పకుండానే వాను కదిలింది. దొంగలాగా కొమరయ్యకు దొరకకుండా పారిపోయింది. వాను వెంట కొంతదూరం పరుగులుతీసి

మరి పరిగెట్టలేకో, పరిగెట్టినా లాభం లేదనో కొమరయ్య ఆగిపోయాడు. ఆయాసపడుతూ నిస్సహాయంగా ఊరి వారి వంక చూశాడు. ఊరివారు కూడా కొమరయ్య వంక జాలిగా చూశారు. తాము చెప్పినదాంట్లో అసత్యం రవ్వంత కూడా లేదని ఒట్టు పెట్టుకున్నట్లు చూశారు. తాము చెప్పినదానికి సాక్ష్యాధారాలు బోలెడున్నాయన్నట్లు చూశారు.

మొన్న సాయంత్రం రైతులింకా ఇంటికి చేరని వేళ, పశువులు ఇంటికి చేరే వేళ, నిశాచరులు మేలుకొనే వేళ, కొమరయ్య పెద్దకూతురు నాంచారి గడ్డిమోపు నెత్తిన పెట్టుకుని పొలం గట్టు మీదనుంచి నడిచివస్తోంది. ముతకకోక కట్టుకున్నా ఉసిగొలిపే ఆమె ఒళ్ళు గంతులేస్తోంది. పరువంలో ఉన్న పడుచు చిన్నది. ఎవరూ ఇంతవరకూ చెయ్యి వెయ్యనిది. నాంచారిని చూడగానే సుబ్బారాయుడి మనసు ఉండబట్టక, తాచు పాములాగా చరచరా పరుగులెట్టింది. కాళ్ళు ఉరుకులాడాయి నాంచారి దగ్గరకు. చేతులూరుకోక నాంచారిని వాటేసుకున్నాయి. సుబ్బారాయుడు తండ్రిలాగే మహా సరసుడు. కాని వేళా పాళా, చోటూ సందర్భం తెలియని మోటువాడు. మూర్ఖుడు. సుబ్బారాయుడ్ని బలంకొద్దీ ఎడంచేత్తో ఒక్క విసురు విసిరింది నాంచారి. సుబ్బారాయుడు కాలుజారి బోదెలో పడ్డాడు. దూరాన రంగడు కనిపించకపోతే నాంచారిని వొదిలేవాడు కాదు సుబ్బారాయుడు. ఏదో చేసేవాడు. కసి తీర్చుకునేవాడు కోరిక తీరిందాకా.

అది ఏదో జరిగితే రంగడు నిన్ననే ఏదో చేసేసేవాడు. ఆ బోదెలోనే పాతేసేవాడు. కాని పారిపోయే పిరికివెధవ వెనక తనుకూడా పరుగులెడితే తన మగతనానికి వన్నె తరుగుతుందని కాబోలు, రంగడు పరుగులెట్టలేదు.

"ఒరేయ్! ఇప్పుడు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని పారిపోయినా, ఎప్పుడో ఒకప్పుడు చేతికి చిక్కకపోవు. చిక్కితే ఈమారు నరకానికి నేనే పరుగులు తీయిస్తాలేరా!" అంటూ హెచ్చరించి, నాంచారికి ధైర్యం చెప్పి తీసుకుపోయాడు రంగడు.

నిన్న చేతికి చిక్కి ఉంటాడు చంపేశాడు. అన్నారు పొలం గట్టుమీద జరిగిన విషయం చూసినవారు. లేకపోతే వెంకట్రాముడి కొడుకుమీద చెయ్యి చేసుకోగల మగాడెవడున్నాడు? అంత ధైర్యం ఎవరికుంది? అనుకుని సరాసరి కొమరయ్య ఇంటికేసి పరుగులెట్టారు. రంగడి ఒంటిమీద రక్తపు మరకల పంచె కొంత సాక్ష్యమిచ్చింది. కుయ్ కయ్ మనకుండా, పట్టుబడ్డ రంగడు, నేరం మరింత బలపరిచాడు. సుబ్బారాయుడు చచ్చింది కొబ్బరితోటలో. వెన్నులో గుచ్చింది గునపం. ఇంతకంటే గట్టిసాక్ష్యాలు ఇంకా ఏం కావాలి?



సుబ్బారాయుడ్ని రంగడే చంపినట్లుగా చచ్చేన్ని ఆధారాలు ఊరివారికి దొరికాయి. సాక్ష్యమివ్వడానికి భయ మెందుకని ముందుకు తోశాయి. రంగడ్ని జైలుపాలు చేశాయి.

అందరి కళ్ళలో తృప్తి, సంతృప్తి, అన్యాయాన్ని, అక్రమాన్ని అమాంతం పట్టుకున్నందుకు. బేడీలు వేసినందుకు.

కాని కూనయ్యతాత మనసుని నమ్మించలేకపోతున్నది. కాని నమ్మకం కూడా కలుగుతోంది. ఇన్ని బలమైన సాక్ష్యాలు కళ్ళ ఎదురుగుండా ఉండగా నమ్మకపోవడం ఎలా సాధ్యం? విలవిల లాడిపోయాడు కూనయ్యతాత.

రంగడు బలవంతుడు, మోటువాడు. మాట పడనివాడు. అన్యాయాన్ని, అక్రమాన్ని సహించనివాడు. ఎందరు వచ్చినా న్యాయం బ్రతకాలనే ఆదర్శం కలవాడు. అలాగని రంగడు, దుష్టుడు కాడు. మనిషి ప్రాణాలతో చెలగాటా లాడే కసాయివాడు కాదు. ఇలా చేయ డానికి బలవత్తరమైన కారణం ఏదో

ఉండే ఉంటుందనుకున్నాడు కూనయ్య తాత.

"ఏ దేముడైనా అడ్డునిలిచి రంగడ్ని కాపాడితే బాగుణ్ణు" అని మూగగా దైవాన్ని ప్రార్థించాడేకానీ, ఇది ఔను, ఇది కాదు, అనలేక, మౌనంగా చూస్తూ ఊరుకున్నాడు.

కొమరయ్యని ఊరడించాలనీ, రత్తాలుని ఓదార్చాలనీ ఏదో ఏదో చెప్పాలనీ అనిపించింది కూనయ్యతాతకు.

కాని తాత మాటలు ఎవరూ వినరు. పేదరికం మూగది. శబ్దం లేనిది. అధికారానికి అంక్షలు లేవు. చట్టం అధికారం చెప్పిందే వింటుంది. ఆచరిస్తుంది. అని తల పండి ముగ్గిపోయిన తాత జీవిత అనుభవపు పుస్తకంలో ఎన్నో పేజీలు వ్రాసుకున్నాడు. మళ్ళీ మళ్ళీ చదువు కుంటాడు. అందరికీ వినిపించాలను కుంటాడు. కాని అది అందరికీ తెలిసిన సత్యమేనని ఊరుకుంటాడు.

అందుకే రత్తాలు గుండెలు బద్దలు కొట్టుకుంటున్నా ఓదార్చలేదు కొమరయ్య వాన్ వెంట పరుగులుతీసినా ఆపలేదు.

తీర్పు ఇచ్చేది న్యాయస్థానం. ఆ చోటులో తప్పక న్యాయం జరుగుతుందని అందరికీ నమ్మకం (అన్యాయం చేసిన వారికి కూడా). అది గొడుగులాంటిది. న్యాయం తడిసి ముద్దైపోకుండా గోవర్ధన పర్వతం లాగా చోటిస్తుందని నమ్మకం; ఒంటపట్టిన ఆ నమ్మకం కొమరయ్యకు ధైర్యం చెప్పింది కాబోలు. కొమరయ్య పరుగు ఆపేశాడు. కొమరయ్య అమాయకత్వానికి కూనయ్యతాత విషాదంగా నవ్వుకోడం తప్ప ఆశ్చర్యపడలేదు.

తీర్పుకోసం న్యాయస్థానం చేరుకున్నారు చాలామందిలాగే ఆ ఊరివారు కూడా.

కావలసినవారు, తనవారు, పగవారు, అందరివారు, ఎవ్వరికీ ఏమీ కానివారు. అందర్నీ ఒక్కమారు కలయచూశాడు రంగడు. జాలిగా చూశాడు. బాధగా చూశాడు. లోతుగా నిట్టూర్చాడు. తనలో తానే నవ్వుకున్నాడు, తీర్పు ఏమిస్తారో, ఎలో ఇస్తారో రంగడికి తెలుసు.

న్యాయం, చచ్చినవాడిని బ్రతికించలేదు. కాని బ్రతికున్నవాడిని చంపగలదు. అని తాత చాలామార్లు చెబుతుంటే రంగడు విన్నాడు. అనుభవజ్ఞుడైన తాత మాటల్లో దాక్కున్న నిజం రంగడి మనసులో స్థిరనివాసాన్ని ఏర్పరచుకుంది. మంటలు రేపుతుంది.

కూనయ్యతాతంటే రంగడికి భక్తీ, గౌరవమూ, ఇష్టమూనూ. తాత మాటల మీద గురి. వారిద్దరిమధ్యా ఏ దాపరికాలు లేవు. ఏ అడ్డుగోడలూ లేవు. రంగడికళ్ళు కూనయ్యతాత కోసం వెతుకులాడాయి. తాతను చూశాయి. కళ్ళూ కళ్ళూ కలుసుకున్నాయి. ఆ కళ్ళు ఏం ఊసులాడుకున్నాయో! అశ్రుధారలు రాల్చాయి, నాలుగు కళ్ళూ.

తీర్పు వినిపించింది. మార్పులేని తీర్పు అది. ఆ తప్పుకు అందరికీ ఇచ్చే తీర్పు అది. న్యాయాధికారి నోటినుండి వచ్చిన తీర్పు వంద లాది చెవుల్లో దూరింది. గుండెలు బ్రద్దలు చేసింది.

కొమరయ్య అద్దంలాంటి గుండె పగిలి ఛిన్నాభిన్నమైపోయింది. ఆ ముక్కల్ని కష్టపడి కూడతీసినా తిరిగి గుండె కాదని కొమరయ్యకు తెలుసు. అందుకే కుమిలి కుమిలి పోతున్నాడు ఏమీ చెయ్యలేక.

ఐదేళ్ళ పిల్లవాడుగా రంగడ్ని తల్లీ తండ్రీ తన చేతులకి అప్పగించి పోయారు. అప్పటినుంచీ గుండెలో దాచుకుని పెంచాడు. రంగడ్ని ఉరితీసి చంపారని అందరూ చెప్పుకుంటారు, కాని కొమరయ్య ఉరి తియ్యకుండానే చచ్చిపోతున్నాడని ఎవరికీ తెలియదు.

"రంగా! ఎంత పని చేశావురా! ఎందుకిలా చేశావురా? బ్రతికున్నంత కాలం నాకీ చిత్రవధ ఎందుకు విధిం చావురా!" అనుకుంటూ కుమిలి కుమిలి ఏడ్చాడు చిట్టితమ్ముడ్ని ఎత్తుకు పెంచిన తన చేతుల్ని చూసుకుంటూ. పరిగెత్తు కుని వెళ్ళి న్యాయాధికారితో, ఆ ఖూనీ తనే చేశానని చెప్పి తమ్ముడ్ని విడిపించా లనుకున్నాడు. కాని.... ఆ పని ఎప్పుడో చేసి ఉండాల్సిందని కొమరయ్యకు తెలుసు. కాని అంతా అయిపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదని కొమరయ్యకు తెలుసు. తమ తరపున వాదించడానికి కూడా ఎవరూ లేరు.

తీర్పు చెప్పేశారు. దానికి. తిరుగు లేదు. రోజుల వ్యవధిలో రంగడి రంగే మారిపోతుంది. బ్రతికినప్పటికంటే చచ్చి జీవం పోసుకుంటాడు. ప్రజల మధ్య రంగడు కథగా మిగిలిపోతాడు. కాని తనో! జీవచ్ఛవం. బ్రతికున్నంత కాలం చావాలి. చచ్చి బ్రతకాలి

ఇప్పుడు తమ్ముడ్ని తన ముందర్ని నుంచే తీసుకువెళతారు. తమ్ముడు తన వంక కడసారి చూస్తే ఎలా తట్టుకోవాలి? ఆ జాలిచూపులు ఎలా భరించాలి?" గిలగిల లాడిపోయాడు కొమరయ్య.

'వదినా! అంటూ ఒళ్ళో తలదూర్చి బావురుమంటే ఎలా ఓదార్చాలి? ఏమ నాలి? ఏం చెప్పాలి? నిద్రపుచ్చి, లాలించి, బువ్వ తినిపించిన ఈ చేతు లతో లేవనెత్తి మృత్యువుకు ఆహారంగా వెళ్ళమని ఎలా పంపాలి?' గజగజ లాడిపోయింది రత్తాలు నిస్సహాయంగా రంగడ్నే చూస్తూ - దుఃఖం పొల్లు కొస్తుంటే, కోర్టువారు తిడతారన్న భయంతో బలవంతాన ఆపుకుంటోంది రత్తాలు.

కాని రంగడు అన్నవంక చూడలేదు. వదిన ఒళ్ళో ఒరగలేదు. శూన్యంలోకి చూస్తూ చిరునవ్వులు చిందిస్తూ సంతోషంగా వెళ్ళిపోయాడు. అన్నా

వదినలతోపాటు, ముఖమెరిగిన అనేక మందిని దాటుకుంటూ వెళ్ళిపోయాడు.

కొమరయ్యా, రత్తాలూ బిగుసుకు పోయారు, తాము ఊహించింది జరగ నందుకు.


రంగడ్ని ఉరితీసేశారు. సుబ్బా రాయుడ్ని చంపినందుకు రంగడ్ని ఉరి తీశారని ఊరివారంతా చెప్పుకున్నారు. కాని తాత నమ్మలేకుండా ఉన్నాడు. రంగడు కనీసం తనను పిలిచి ఏదో చెపుతాడనుకున్నాడు. రంగడు ఆ ఖూనీ చెయ్యలేదు. చెయ్యడు అనుకున్నాడు. కాని తీర్పు చెప్పటం, ఉరి తియ్యటం జరిగిపోయింది ఎవరి నమ్మకాలకోసం ఆగకుండా. తాతని పిలవాలేదు, ఏదీ చెప్పాలేదు.

కాని రంగడు ఉరితీసేముందు కనీసం తాతతో జరిగింది చెప్పాలనుకున్నాడు. ఎందుకంటే నిజం చెప్పడం కూనయ్య దగ్గిరే నేర్చుకున్నాడు రంగడు. త్యాగం ఎప్పుడు చెయ్యాలో, అబద్ధం ఎప్పుడు చెప్పాలో తాత దగ్గిరే నేర్చుకున్నాడు. అందుకే తాతకు చెప్పాలనుకున్నాడు. నిజం చెప్పేస్తే బరువు తీరుతుందను కున్నాడు

"ఆ రోజు, ఖూనీ జరిగిన రోజు, రాత్రి చాలా పొద్దుపోయింది. సంత నుంచి ఇంటికి తిరిగొస్తుంటే కొబ్బరి తోట చివరగా నాంచారి గట్టుమీద నుంచి నడిచొస్తోంది. అన్నయ్య ఇంకా తోటలో బోదెలు తవ్వి స్తు న్నా డు. నాంచారి ఎదురుగా ఎవరిదో పురుష ఆకారం వెడుతోంది. వెన్నెల కావడంతో ముఖాలు కనిపించకపోయినా, ఆకా రాలు, చర్యలు దూరాన్నుంచే కని పించాయి. ఆ ఆకారం అమాంతం నాంచారిని వాటేసుకుంది. ఆ వ్యక్తి సుబ్బారాయుడేనని గుర్తుపట్టాను. నాంచారి గిలగిలా కొట్టుకుంటూ అరి చింది. పట్టు విడిపించుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. ఆ అరుపు దేన్నో జ్ఞాపకం చేసింది.

నా చిన్నప్పుడు, వదిన్ని వెంక ట్రాయుడు ఇలాగే వాటేసుకున్నాడు. గడ్డివాము వెనక్కి తీసుకెళ్ళాడు. వదిన గిలగిలా కొట్టుకుంది. అరిచింది. ఏడ్చింది. వెంకట్రాయుడు వదిన్ని ఏదో చేసి, గడ్డివాము వెనకాలే వదిలేసి వెళ్ళిపోయాడు. వెంకట్రాయుడు వెళ్ళిపోగానే, వదిన పరిగెత్తుకుంటూ వెళ్ళి మోటబావిలో దూకింది. అప్పుడు వెంకట్రాయుడు వదిన్ని ఏం చేశాడో ఇప్పుడు నాకు తెలుసు. మళ్ళీ అన్నయ్య కూతురు. అభం శుభం ఎరుగని నాంచారి కూడా వదినలాగే అయిపో తుందని భయం వేసింది.

అప్పుడు చిన్నవాణ్ణి ఏమీ చేయలేక పోయాను. కానీ ఇప్పుడు, ఎవరినైనా ఏమైనా చెయ్యగలను. అందుకే సంచీ అక్కడ పడేసి సుబ్బారాయుడ్ని పట్టు



కోవాలని పరుగెట్టాను. పట్టు తప్పించుకుని ముందు నాంచారి పరిగెడుతోంది. దానికోసం సుబ్బారాయుడు, వాడికోసం నేను ఒకరి వెనక మరొకరం పరుగులెట్టాము.

ఇంతలో పెద్దగా చావుకేక వినిపించింది ఎక్కడినుంచో. శబ్దంవచ్చిన వైపుకు పరిగెత్తా. అక్కడ సుబ్బారాయుడు గిలగిలా కొట్టుకుంటున్నాడు. వెనక వోటుగా గునపంతో పొడిచారెవరో. నాంచారి కోసం ఇటూ అటూ చూశా. లేదు.

ఊరి పీడ విరగడైనందుకు సంతోషం కలిగింది. ఆ వార్త మెల్లగా అన్నయ్య చెవిలో ఊదాలన్న ఆత్రంతో ఇంటికి వెళ్ళా. గుడిశలో గుడ్డిదీపం మిణుకు మిణుకు మంటోంది. ఇంట్లో చడీ చప్పుడూ లేదు. కిటికీలోంచి లోపలికి చూశా. ఏమైందో ఏవిటో పిల్లలంతా బిక్కమొహాలేసుకని వదిన చుట్టూ కూర్చున్నారు. వదిన ఏడుస్తోంది. అన్నయ్య కళాకాంతిలేని ముఖంతో మాటా పలుకూ లేకుండా కూచున్నాడు.

"ఎంతపని చేశావయ్యా! నా కెందుకింత అన్యాయం చేశావయ్యా! నీకు పెళ్ళి కాలేదనుకున్నావా! పిల్లల్లేరనుకున్నావా? నువ్వు కోపంతో ఒక్కు పట్టక ఆడ్ని చంపితే, నిన్ను కోర్టు వాళ్ళు చంపుతారు కదుటయ్యా! నా ఏడుగురు ఆడపిల్లల్నీ ఏంచేద్దామను

కున్నావయ్యా? మగదిక్కు లేదని తెలిస్తే అభిమన్యుడి ఒక్కడిమీద వంద మంది పడ్డట్లుగా నా బిడ్డల గతీ అంతే అవుతుంది గదయ్యా. మా అందర్నీ కూడా అదే చేత్తో చంపి పుణ్యం కట్టుకోవయ్యా!" అంటూ వదిన నెత్తి మొత్తుకుంటూ ఏడుస్తోంది.

"ఆవేశంలో నేనంత దూరం ఆలోచించలేదే రత్తాలూ! నా బిడ్డని కాపాడుకోవాలనే అనుకున్నా గానీ....రత్తీ పిల్లల్ని తీసుకుని పారిపోదాం పద" అన్నాడు అన్నయ్య.

"సాల్లే తెలివి. మండినట్టే ఉంది. పెద్దపులిని పిలిచి పారంటం పెడతావా? అసలు నువు ఖూనీ చెయ్యడం ఎవరూ చూసుండరు. తెల్లారినాక తెలివిగా ఎవరిమీదో నెట్టేస్తే సరి" వదిన అన్నయ్యకు ఉపాయంతో పాటు ధైర్యం చెప్పింది.

మరి నేను ఇంట్లో అడుగు పెట్టలేదు. నా మనసులో ఏదో తళుక్కున మెరిసింది. వెంటనే తోటలోకెళ్ళి ఒంటినిండా రక్తం పూసుకుని వచ్చా.

"అన్నయ్య లేకపోతే ఏడుగురు పిల్లలూ, వదినా అనాథలైపోతారు. అన్నయ్య లేకుండా నేనున్నా మరిదిని, చిన్నాన్ననే కానీ వదినమ్మకు భర్తను, పిల్లలకు తండ్రినీ కాలేను. నా కోసం ఏడ్వటానికి అమ్మా నాన్నా భార్యా పిల్లలూ ఎవరూ లేరు. అన్నయ్య కొంతకాలం ఏడ్చి మరిచిపోతాడు. వదినమ్మా అంతే. నాది త్యాగం కాదు. అన్నయ్య వదినల ఋణం తీర్చుకునే మంచి అవకాశం" అనిపించింది రంగడికి మనసుకు మించిన న్యాయస్థానం లేదనిపించింది. తాను చెయ్యదలచిన దాంట్లో చేసినదాంట్లో అధర్మమేమీ కనిపించలేదు. అందుకే ఎవరికీ ఏమీ చెప్పలేదు. గర్వంగా తృప్తిగా గాలి పీల్చుకున్నాడు రంగడు ఆఖరిసారిగా.

నిజం పదిమందిలో సమాధైపోయినా కొమరయ్య గుండెల్లో చచ్చేదాకా బ్రతికి జ్వాలలు రేపుతూనే ఉంది.

